దేవాదాయ శాఖ పరిధిలోకి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరాలయం

ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శ్రీనివాస్‌శర్మ నియామకం

ఆలయంలోని వస్తువులు, ఇతర వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

పరిగి, ఫిబ్రవరి 12 : పరిగి పట్టణంలో గల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం దేవాదాయ శాఖ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్ మధుబాబు, అనంతగిరి దేవాలయం ఈవో నరేందర్, పరిగి ఆలయ ఈవో శ్రీనివాస్‌శర్మ, అత్తాపూర్ ఈవో ప్రవీణ్, హైదర్‌గూడ ఈవో చంద్రమోహన్ పరిగిలోని ఆలయాన్ని సందర్శించి ఆలయంలో గల అన్ని వస్తువులు, ఆస్తుల వివరాలు సేకరించారు. 2018 ఏప్రిల్ 19వ తేదీన అప్పటి దేవాదాయ శాఖ కమిషనర్ పరిగి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకుంటూ, ఈవోను నియమించగా అప్పట్లో ఆలయ కమిటీ వారి విన్నపం మేరకు 2018 ఏప్రిల్ 25వ తేదీన ప్రిన్సిపల్ సెక్రటరీ స్టే విధించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈనెల 8వ తేదీన దేవాదాయ శాఖ కమిషనర్ స్టేను ఎత్తివేయడంతోపాటు 10వ తేదీన పరిగి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఈవోగా శ్రీనివాస్‌శర్మను నియమించారు. దేవాదాయ శాఖ అధికారులు ఎవరికీ చెప్పకుండా, ఆలయ కమిటీ వారికి సైతం సమాచారం ఇవ్వకుండా, కేవలం కాంగ్రెస్ నాయకులకే సమాచారం ఇచ్చి సోమవారం ఉదయం పరిగి ఆలయానికి చేరుకున్నారు. పరిగి ఆలయానికి వచ్చిన తర్వాత దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ ఆలయ కమిటీ అధ్యక్షుడు బాబయ్య, ప్రధాన కార్యదర్శి బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులను పిలిపించి మాట్లాడారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా రావాల్సిన అవసరం ఏమిటని కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తమ హయాంలో చేపట్టిన దేవాలయం, హనుమాన్ ఆలయం, ధ్వజస్తంభం, షెడ్డు నిర్మాణాలు, దుకాణాల నిర్మాణానికి సంబంధించి అన్ని అంశాలపై సమావేశం ఏర్పాటు చేసి అందరి సమక్షంలో వివరాలు పెట్టి, ఆదాయం, ఖర్చు సైతం తెలియజేస్తామని, అలాంటిది అకస్మాత్తుగా వస్తే ఎలా అని అన్నారు. అనంతరం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఇతర అధికారులు ఆలయంలోని వస్తువులు, దేవాలయ పరిధిలోని ఆస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి వస్తువు, ఆస్తుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా 22 దుకాణాలు ఉండగా వాటిలో అద్దెకు ఉంటున్న వారందరినీ విచారించి ఎంత అద్దె చెల్లిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆలయంలో పనిచేసే అర్చకులు, ఇతర వారికి ఇస్తున్న వేతనాలను అడిగి తెలుసుకొని నమోదు చేసుకున్నారు. ఆభరణాల అంశంపై సైతం ఆలయ కమిటీ వారితో చర్చించారు. ఈ సందర్భంగా పరిగి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్‌కు జేఏసీ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, ఎంపీపీ అరవిందరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, మాజీ జడ్పీటీసీ ఎస్పీ బాబయ్య, కాంగ్రెస్ నాయకులు పరశురాంరెడ్డి, ఎ.కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న వాగు కష్టాలు

❑ మహాంతిపూర్‌కు బీటీ రోడ్డు, వంతెన నిర్మాణానికి 23.86 కోట్లు మంజూరు ❑ హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కాకరవాణి వాగు దాటుతున్న గ్రామస్తులు (ఫైల్)

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 12 : మండలంలోని మహాంతిపూర్ ప్రజలకు వాగు కష్టాలు తీరనున్నాయి. గ్రామానికి బీటీ రోడ్డు, వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.23.86 కోట్లు మంజూరు చేసింది. కాకరవాణి వాగు ఒడ్డున ఉన్న ఈ గ్రామ ప్రజలకు వర్షాకాలం వస్తే పొలాలకు వెళ్లాలన్నా, మండల కేంద్రానికి రావాలన్నా నానా అవస్థలు పడేవారు. భారీ వర్షాలు కురిసి వాగు నిండుగా ప్రవహిస్తే వాగు దాటి ఇవతలి ఒడ్డుకు రాలేని పరిస్థితి. బొంరాస్‌పేట మండల కేంద్రం నుంచి గ్రామానికి నేటికీ పక్కా రోడ్డు సౌకర్యం లేదు. గ్రామం నుంచి మండల కేంద్రం మూడు కిలోమీటర్ల దూరమే ఉన్నా సరైన రోడ్డు సౌకర్యం లేక యాలాల మండలం దేవనూరు నుంచి 10 కిలోమీటర్లు తిరిగి మండల కేంద్రానికి రావాల్సిందే. కాకరవాణి వాగుపై వంతెన నిర్మించి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని దశాబ్దాలుగా ప్రజలు కోరుతున్నా నెరవేరలేదు. రెండేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చొరవ తీసుకుని బొంరాస్‌పేట నుంచి మహాంతిపూర్ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించ డానికి రూ.3 కోట్లు మంజూరు చేయించారు. టెండరు పూర్తయినా కాంట్రాక్టరు పనులు ప్రారంభించకపోవడంతో సమస్య అలాగే ఉండిపోయింది. కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి గెలుపొంది ముఖ్య మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో మహాంతిపూర్ గ్రామ ప్రజల దశాబ్దాల కల నెరవేరుతున్నది. గ్రామానికి బీటీ రోడ్డుతో పాటు కాకరవాణి వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.23.86 కోట్లను మంజూరు చేసింది. బొంరాస్‌పేట మీదుగా జానకంపల్లి, మహాంతిపూర్, యాలాల మండలం గుబ్బడితండా, దేవనూరు మీదుగా నాగసముందర్ గ్రామం వరకు 9 కిలోమీటర్ల దూరం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే అవకాశం ఉన్నది. ఈ రోడ్డు, వంతెన నిర్మాణ పనులు పూర్తయితే మహాంతిపూర్, జానకంపల్లి గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రావడానికి, తాండూరు వెళ్లడానికి సౌకర్యం కలుగుతుంది. అంతేకాకుండా వర్షాకాలంలో వాగు కష్టాలు తీరనున్నాయి. బీటీ రోడ్డు, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గృహజ్యోతి కోసం వివరాల సేకరణ

వివరాలు సేకరిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 12 : గృహజ్యోతి పథకం అమలు కోసం ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ వినియోగదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ప్రతినెలా ఇంటికి 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారులకు గృహజ్యోతి పథకం కింద ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. హామీ అమలులో భాగంగా అర్హులైన లబ్ధిదారుల వివరాలను ట్రాన్స్‌కో అధికారులు సేకరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం గత నెల నిర్వహించిన ప్రజా పాలనతో దీనికోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారి వివరాలను ట్రాన్స్‌కో అధికారులు సేకరిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి మీటరు రీడింగ్ తీసే సమయంలో సర్వీసు నెంబరు, ఫోన్ నంబరు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు నంబర్లను అధికారులు తీసుకుంటున్నారు. మండలంలో 5862 గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇందులో సుమారు 80 శాతం మంది 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తున్నారని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

చెరువుకు మరమ్మతులు చేయాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ

కొడంగల్, ఫిబ్రవరి 12: మండలంలోని హస్నాబాద్ గ్రామ పెద్ద చెరువు తూము నుంచి నీరు వృథా పోతున్నదని, మరమ్మతులు చేయించాలని సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్నాబాద్ చెరువు పెద్ద విస్తీర్ణంతో పాటు పూర్తి స్థాయిలో నీటి నిల్వ ఉంటుందని, ప్రతి సంవత్సరం ఇటువంటి ఇబ్బందులతో నీరు వృథా అవుతున్నట్లు తెలిపారు. హస్నాబాద్ పెద్ద చెరువు రైతులతో పాటు మత్స్యకారుల జీవనోపాధికి, తాగునీటికి ఎంతగానో అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

పాలకవర్గ సభ్యులకు సన్మానం

ధారూరు, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కుర్వ చంద్రయ్య, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను తండా ప్రజలు సోమవారం సన్మానం చేశారు. ఫిబ్రవరి 1 తో వారి పదవీకాలం పూర్తి కావడంతో వారికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్, కాశీరామ్, నందు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి హనుమాన్ ఆలయంలో మహోత్సవాలు

ధారూరు, ఫిబ్రవరి 12: మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ధారూరు మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో నూతన హనుమాన్ ఆలయంలో ఆంజనేయ, ధ్వజస్తంభ, నవగ్రహ, వినాయక విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, మహా సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మాతృక పూజ, ఋత్విక్ వరణాల ప్రతిష్ఠాపన, నవగ్రహ హోమం, గణపతి హోమం, ధాన్యాదివాసం, మంగళహారతి, తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బుధవారం శాంతి పాఠం, ఆవాహిత దేవతా పూజ మహాన్యాసం, శయ్యాదివాసం, మూలమంత్ర హోమాలు, మంగళహారతి, తీర్థ ప్రసాదాలు, దంపతులతో యజ్ఞ కార్యక్రమాల నిర్వహణ, గురువారం శాంతి పాఠం, ఆవాహిత దేవతా పూజ, దేవతా హోమాలు, యంత్ర ప్రతిష్ఠాపన, బలిప్రదానం, పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 12 : మండలంలోని బురాన్‌పూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకుని సివిల్ సప్లై అధికారులకు అప్పగించామని ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు. పరిగికి చెందిన సిరిగిరి అజయ్ అనే యువకుడు ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నాడన్న సమాచారం రావడంతో పట్టుకుని బియ్యం స్వాధీనం చేసుకుని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 12 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అందరు ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆమె కోరారు.

మైనార్టీలను విస్మరించిన బడ్జెట్

కొడంగల్, ఫిబ్రవరి 12: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రవేశపెట్టిన ఓటాన్‌అకౌంట్ బడ్జెట్‌లో మైనార్టీలకు అతి తక్కువగా కేటాయింపులు చేపట్టినట్లు కొడంగల్ మండల కో ఆప్షన్ సభ్యులు ముక్తార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మైనారిటీ గురుకుల భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

బాధితునికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై రవూఫ్

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 12 : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి బాధితుడికి అందజేశారు పోలీసులు. బొంరాస్‌పేటకు చెందిన ఆలగడ్డ చెన్నకేశవులు ఇరవై రోజుల కిందట సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఫోన్‌కు సంబంధించిన ఐఈఎంఐ నంబరుతో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ విధానం ద్వారా ఫోన్‌ను కనుగొని సోమవారం ఎస్సై రవూఫ్ బాధితుడికి అందజేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

వికారాబాద్, ఫిబ్రవరి 12 : వికారాబాద్ మండలం ఆలంపల్లి సర్వే నంబర్ 290, 291,292 లో గల ప్రభుత్వ భూమిని కాపాడాలని సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి రామయ్యగూడ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు వారు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా హద్దులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన వారిలో రమేశ్, సుధాకర్, అనంతయ్య, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలతోనే ప్రజల మన్ననలు



ఎంపీడీవో శేషగిరిశర్మను సన్మానిస్తున్న ఎంపీపీ అరవిందరావు

పరిగి, ఫిబ్రవరి 12 : అత్యుత్తమ సేవలు అందించిన అధికారులు చిరస్మరణీయులుగా అందరి హృదయాలలో నిలిచిపోతారని పరిగి ఎంపీపీ కరణం అరవిందరావు పేర్కొన్నారు. పరిగి ఎంపీడీవోగా పనిచేస్తున్న శేషగిరిశర్మ నల్లగొండ జిల్లాకు బదిలీ కావడంతో సోమవారం సాయంత్రం ఆయనను ఎంపీపీ, ఎంపీటీసీలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీడీవో శేషగిరిశర్మ అందరికీ అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. ఆయన చేసిన సేవలకు ఉత్తమ సేవా అవార్డు అందు కున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కె.వెంకట్‌రాం రెడ్డి, ఎంపీవో దయానంద్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ రవి, మండల పరిషత్ కార్యాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీఐ పరిరక్షణ జిల్లా కమిటీ ఎన్నిక

ఏకగ్రీవంగా ఎన్నికైన సమాచార హక్కు చట్టం పరిరక్షణ జిల్లా కమిటీ సభ్యులు

వికారాబాద్, ఫిబ్రవరి 12 : సమాచార హక్కు చట్టం పరిరక్షణ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ ముదిరాజ్ అన్నారు. సోమవారం వికారాబాద్‌లో జరి గిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టీఐ పీసీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆదేశానుసారం రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్‌లను నియమించినట్లు చెప్పారు. జిల్లా కమిటీ సభ్యులు ఆర్టీఐ పీసీ నియమ నిబంధనల ప్రకారం అవినీతిని అంతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేయకుండా కమిషనర్లను నియమించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ సమాచార హక్కు చట్టం-2005 బోర్డులను పెట్టాలని ఆయన కోరారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

సమ్మె కరపత్రాలు విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేతలు

పరిగి, ఫిబ్రవరి 12: ఈనెల 16వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మె, బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య కోరారు. సార్వత్రిక సమ్మె, బంద్ కరపత్రాలను సోమవారం పరిగిలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని విమర్శించారు. కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెడుతున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు రైతులు పంటల కోసం పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర గ్యారెంటీ చేసేలా చట్టం చేయాలన్నారు. పేద, మధ్య తరగతి రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు పైబడిన వారందరికీ పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.డి.హబీబ్, సత్యయ్య, రఘురామ్, శేఖర్, ప్రశాంత్, రమేశ్‌బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ ధ్యానం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి

పరిగి, ఫిబ్రవరి 12: భక్తియోగం కంటే ధ్యాన యోగం గొప్పదని, ప్రతిఒక్కరూ శ్రీకృష్ణుడు చెప్పిన రాజయోగ జీవితాన్ని గడపాలని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మార్కండేయ జయంతి సందర్భంగా పరిగిలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించిన యజ్ఞం సందర్భంగా పద్మశాలీలకు శ్వాస మీద ధ్యాస ధ్యానం అందించారు. అంతకుముందు మండలంలోని లక్నాపూర్ మిట్టకోడూర్, ఇబ్రహీంపూర్ గ్రామాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ధ్యానంపై ఆంజనేయరెడ్డి, నవీన్‌లు శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజూ ధ్యానం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రాధ, శోభిత, శైలజ, రాంచంద్రయ్య, శ్రీనివాస్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్, రాము, అశోక్, నారాయణ, శ్రీశైలం, కృష్ణ, బాలమణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గెలుపొందిన విద్యార్థులతో కరాటే మాస్టర్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పూడూరు, ఫిబ్రవరి 12 : వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిధిలోని కేశవరెడ్డి రెసిడెన్షియల్ పాఠశాలలో తైక్వాండో కరాటే పోటీలను ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి రెండు రోజులు ఘనంగా నిర్వహించామని తైక్వాండో జిల్లా కార్యదర్శి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. తైక్వాండో పోటీలతో రిజర్వేషన్లు, ఉన్నత విద్య, ఉపాధి పొందే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. మానసిక, శారీరక దృఢత్వంతో పాటు ఆత్మరక్షణ కోసం బాలికలు కరాటే నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పోటీలో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు.

లారీని ఢీ కొట్టిన బైక్.. వ్యక్తికి తీవ్రగాయాలు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 12: లారీని ఓ బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన కరన్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రం లోని చౌడాపూర్ గ్రామానికి చెందిన బస్వరాజ్ కల్‌శెట్టి బైక్ పై తాండూరు వైపు వెళుతున్నాడు. లారీ కూడా తాండూరు వైపు వెళ్తన్నది. మండల పరిధిలోని కోటబాసుపల్లి కేరళ మాడల్ స్కూల్ సమీపంలోకి రాగానే లారీని డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. వెనకాలే ఉన్న బైక్ పై ఉన్న బస్వరాజ్ కల్‌శెట్టి లారీని ఢీ కొట్టాడు. దాంతో తీవ్రగాయాల పాలయ్యా డు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హుండీలో రూ.70 వేల నగదు చోరీ

తాండూరు రూరల్, ఫిబ్రవరి 12: వీరభద్రేశ్వర ఆలయంలోని హుండీలో ఉన్న నగదును దొంగలు దోచుకెళ్లినట్లు కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూరు మండలం, వీరారెడ్డిపల్లి గ్రామ సమీపంలోని వీరభద్రేశ్వర దేవాలయంలోని హుండీని దొంగలు పగలగొట్టి, రూ. 70,000 వేల నగదును దొంగలించినట్లు తెలిపారు. ఆలయ పూజారి మడపతి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు

పేకాటస్థావరంపై దాడి

ఇద్దరి అరెస్ట్.. పరారీలో నలుగురు

తాండూరురూరల్, ఫిబ్రవరి 12 : పేకాట స్థావరంపై దాడి చేసి, ఇద్దరిని అరెస్టు చేయగా, మరో నలుగురు పరారీలో ఉన్నారని తాండూరు మండలం, కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామ శివారులో ఆరుగురు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వెంకటప్ప, అంజిలప్ప, బంటు నర్సింహులు, ఈదుల ఆశప్ప, నల్లోల అంజిలప్ప, కుర్వ మల్లప్పలు పేకాట ఆడుతున్నారు. అయితే అందులో ఇద్దరు చిక్కగా, మరో నలుగురు వ్యక్తులు పరారీ అయ్యారని తెలిపారు. వారి నుంచి రూ.3,175ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మహిళా డాక్టర్ అదృశ్యం...

శిరీషా రెడ్డి (ఫైల్)

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 12: హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళా డాక్టర్ అదృశ్యమైంది. ఈ ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్సై సైదులు కథ నం ప్రకారం... కడప జిల్లాకు చెందిన కే. శిరీషారెడ్డి(25) కొంతకాలం క్రితం ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో జనరల్ ఫిజిషియన్‌గా పనిచేసింది. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో శిరీషారెడ్డి తన స్నేహితుడు సాయికి ఫోన్‌చేసి తాను వెళ్లిపోతున్నట్లు చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన శిరీషారెడ్డి ఆచూకీ తెలియక పోవడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, శిరీషారెడ్డికి ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

ఫకీర్ సాహెబ్ (ఫైల్)

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 12: ద్విచక్రవాహనం అదుపుతప్పి వాహన దారుడు మృతిచెందిన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...గౌలిదొడ్డి జర్నలిస్టు కాలనీ ప్రాంతానికి చెందిన ఫకీర్ సాహెబ్(22) అతడి స్నేహితుడు సాయితో కలిసి బైక్‌పై గౌలిదొడ్డి నుంచి నానక్‌రాంగూడ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో వాహ నం అదుపుతప్పి క్యూసిటీ వద్ద రోడ్డుపై నిలిపిఉన్న జీహెచ్ఎంసీ శానిటేషన్ వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టారు. దీంతో తీవ్రగాయాలకు గురైన ఫకీర్ సాహెబ్, సాయిలను సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఫకీర్ సాహెబ్ మృతిచెందగా, సాయి తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 12: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గచ్చిబౌలిలోని ఇండియన్ బిజినెస్ స్కూల్ సమీపంలో ప్రదాన రహదారిపై ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఉస్మానియా ద